News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :334 | ఖమ్మం | శుక్రవారం జనవరి 17, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# అక్రమాలకు తావులేదు

- దురుద్దేశం కూడా లేదు
- ఫార్ములా-ఈ ఆపరేషన్స్‌కు డబ్బు చెల్లించాలని చెప్పా
- నిబంధనల మేరకు నడుచుకోవాల్సింది అధికారులే
- ఈడీ విచారణలో స్పష్టం చేసిన కేటీఆర్



తాను ఆదేశాలు ఇచ్చినప్పటికీ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని మాజీ మంత్రి కేటీఆర్ ఈడీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఫార్ములా-ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈవో)కు డబ్బు చెల్లించాలని చెప్పింది తానేనని ఒప్పుకొన్న ఆయన.. మిగతా వ్యవహారం పర్యవేక్షించాల్సింది సంబంధిత అధికారులేనని స్పష్టం చేసినట్లు సమాచారం. విదేశీ సంస్థకు నిధుల చెల్లింపు విషయంలో ఆర్బీఐ అనుమతి తీసుకోకపోవడం సమన్వయలోపం వల్ల జరిగిందే తప్ప ఇందులో ఎలాంటి దురుద్దేశం

వివరాలు 2లో..



# కేసీఆర్ దోచుకున్నడు మేం పథకాలకు మళ్లించాం

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు 2 గ్యారెంటీలను ప్రకటించిన రేవంత్ రెడ్డి
- రూ. 500 కే సిలిండర్, 300 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు
- కేజ్రీవాల్, మోదీ ఇద్దరూ ఒక్కటే
- కాలుష్యాన్ని అదుపు చేయలే.. ఢిల్లీ రావాలంటే భయపడే పరిస్థితి
- 3 సార్లు గెలిచినా ఢిల్లీని అభివృద్ధి చేయలేదు
- తెలంగాణలో 21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశాం
- ఏడాదిలో 55,140 సర్కారు ఉద్యోగాలు ఇచ్చినం
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారని, ఆ డబ్బులనే తాము సంక్షేమ పథకాలకు మళ్లించి గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన రెండు గ్యారెంటీలను విడుదల చేశారు. ఢిల్లీలో అధికారంలోకి వస్తే రూ. 500కే సిలిండర్ అందిస్తామని, గృహావసరాలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలల పూర్తయిందని, ఏడాదిలోపు 25 లక్షల 50 వేల రైతు కుటుంబాలకు 21 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా రుణమాఫీ చేయలేదని అన్నారు. రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి గ్యారెంటీని నిలబెట్టుకున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది లోనే 55,140 సర్కారు ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. మోదీ ప్రధాన మంత్రి అయ్యి 11 ఏండ్లవుతుందని, ఇప్పటి వరకు కేవలం ఏడు లక్షల ఉద్యోగాలే ఇచ్చారని అన్నారు. వాస్తవానికి ఆయన ఇవ్వాల్సినవి 22 కోట్ల కొలువులని అన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు గృహావసరాలకు ఫ్రీ కరెంటు ఇస్తున్నామని చెప్పారు. తెలంగాణలో తాము ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని అన్నారు. మూడు సార్లు కేజ్రీవాల్ సీఎం, మోదీ పీఎం అయినా ఢిల్లీ అభివృద్ధి చెందలేదని అన్నారు. కాలుష్యం కోరల్లో చిక్కుకున్న ఢిల్లీకి రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉందని అన్నారు. షీలా దీక్షిత్ సీఎంగా ఉన్న సమయంలోనే హస్తిన అభివృద్ధి చెందిందని, దేశంలోనే

వివరాలు 2లో..

# రేపు చంద్రబాబు ఇంటికి వెళుతున్న అమిత్ షా

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్న అమిత్ షా
- అమిత్ షాకు హైలెవెల్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్న చంద్రబాబు
- 19న దావోస్ కు బయల్దేరుతున్న చంద్రబాబు

వివరాలు 2లో..



# యంగ్ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి రూ.25 లక్షల చెక్ అందించిన సీఎం చంద్రబాబు



- ఆస్ట్రేలియా పర్యటనలో అంచనాలకు మించి రాణించిన నితీశ్
- సెంచరీతో మెరిసిన తెలుగు క్రికెటర్
- రూ.25 లక్షల నజరానా ప్రకటించిన ఏసీఏ
- చంద్రబాబు చేతుల మీదుగా చెక్ బహూకరణ

వివరాలు 2లో..

# పార్టీ మారిన పది మందిపై అనర్హత వేయండి..

## సుప్రీం కోర్టులో బీఆర్ఎస్ పిటిషన్

- పార్టీ మారిన పది మందిపై వేటు వేయండి
- ఏడుగురిపై రిట్ పిటిషన్, ముగ్గురిపై ఎస్ఎల్పీ
- హైకోర్టు తీర్పు ఇచ్చి ఆరు నెలలైనా స్పీకర్ నిర్ణయం తీసుకోలే



బీఆర్ఎస్ తరఫున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మె ల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పది మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9 నెలలవుతున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు

వివరాలు 2లో..



# ముగిసిన కేటీఆర్ విచారణ...

## 7 గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించిన ఈడీ

- ఈ-కార్ రేసులో ముగిసిన ఈడీ విచారణ
- రూ. 45 కోట్లు పౌండ్లుగా మార్చి పంపడంపై ఈడీ ప్రశ్నలు
- రెండో సీజన్ లో ఏస్ నెక్స్ట్ తప్పుకోవడంపై కూడా ప్రశ్నల వర్షం

వివరాలు 2లో..

# కృష్ణా జలాల విషయంలో ట్రైబ్యునల్ కీలక నిర్ణయం



- విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం వాదనలు వింటామన్న బ్రిజేష్ ట్రైబ్యునల్
- 811 టీఎంసీలలో రెండు రాష్ట్రాల వాటాను తేల్చడం ముఖ్యమని వెల్లడి
- ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామన్న బ్రిజేష్ ట్రైబ్యునల్

వివరాలు 2లో..

# ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాలు పెరగనున్నాయి
- 2026 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త వేతనాలు



వివరాలు 2లో..

# బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి.. ఆరు చోట్ల గాయాలు

- తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఘటన
- చోరీ కోసం ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన సైఫ్‌పై దాడి
- లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు



వివరాలు 2లో..

# కొల్లేరులో ఆక్రమణలను ఉక్కుపాదంతో అణచివేయండి

- మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకులు ఉండవని అవగాహన కల్పించండి
- 3 నెలల్లోపు సరిహద్దులు ఖరారు చేయండి
- ఏపీకి సుప్రీంకోర్టు ఆదేశం

కొల్లేరు సరస్సులో సహజ నీటిప్రవాహాన్ని అడ్డుకొని వన్యప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా మారిన ఆక్రమణలను ఉక్కుపాదంతో అణచివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. గతేడాది డిసెంబరు 11న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం మూడునెలల్లోపు కొల్లేరు సరిహద్దులను గుర్తించి అక్షాంశాలు, రేఖాంశాలు ఖరారుచేయాలని ఆదేశించింది. మున్సిపల్ ఘనవ్యర్థాలు, చుట్టుపక్కల పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే మురుగునీటిని ఈ సరస్సులోకి వదలకుండా అడ్డుకట్ట వేయాలని నిర్దేశించింది. ఈ ఉత్తర్వులు మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకులు కల్పించవని, రాష్ట్రప్రభుత్వం వారికి అవగాహన కల్పించి కోర్టు ఉత్తర్వుల



వివరాలు 2లో..

# కొల్లేరులో ఆక్రమణలను ఉక్కుపాదంతో అణచివేయండి

- మొదటి పేజి తరువాయి

అమలుకు అడ్డుతగలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కొల్లేరు సంరక్షణ కోసం 2006 ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ అధికారులపై కోర్టుధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడకు చెందిన కె.మృత్యుంజయరావు గతేడాది సెప్టెంబరు 1న అప్పటి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌ను ప్రతివాదిగా చేరుస్తూ దాఖలుచేసిన పిటిషన్‌పై గురువారం విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

### గడువులోగా ధ్వంసం చేయాలి

"ఈ సరస్సులోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో ఉన్న చిన్న, పెద్ద చేపల చెరువులను నిర్దిష్ట గడువులోగా ధ్వంసం చేయాలి. వందెకరాలకు పైబడి విస్తీర్ణంలో ఉన్న చెరువులను 15 రోజుల్లోపు, మిగిలిన చెరువులను 2006 మే 31లోపు తొలగించాలని కేంద్ర సాధికార సంస్థ (సీఈసీ) 2006 మార్చి 20న ఇచ్చిన నివేదికలో పేర్కొంది. రాష్ట్రప్రభుత్వం, అధికారులు ఆ నివేదికలోని అంశాలను తు.చ. తప్పకుండా అమలుచేయాలి. చేపల పెంపకంలో ఉపయోగించే ఎరువుల రవాణాను నిలిపేయాలి. చేపల చెరువులను ధ్వంసం చేసే కార్యక్రమం 2006 ఏప్రిల్ 20 నుంచే మొదలుపెట్టాలని 2006 ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు చెప్పింది. ఆ ఉత్తర్వులను రాష్ట్రప్రభుత్వం అమలుచేయనందున కోర్టుధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఈ పిటిషన్ దాఖలైంది.

### ఆక్రమణలో 15,339 ఎకరాలు

ఆర్‌టీఐ కింద రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో 15,339 ఎకరాలు వివిధ వ్యక్తుల నియంత్రణలో ఉన్నట్లు అమికస్ క్యూరీ తెలిపారు. సరస్సు 901 చ.కి.మీ. మేర విస్తరించినా, అందులో 308.55 చ.కి.మీ. మాత్రమే వన్యప్రాణి సంరక్షణ కేంద్రం కింద నోటిఫై చేసినట్లు చెప్పారు. 6,908.48 హెక్టార్లలో ఆక్వాకల్చర్ ఉంది. ప్రస్తుతం కోర్టు ముందుంచిన సమాచారం ప్రకారం చెరువుగట్ల నిర్మాణం వల్ల సరస్సులో సహజనీటి ప్రవాహానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. కలెక్టర్ అనుమతులతోనే భారీగా పెట్టుబడులు పెట్టి చేపల చెరువులు ఏర్పాటుచేసుకున్నవారి ప్రయోజనాలు రక్షించాలన్న వినతిని కోర్టు తిరస్కరిస్తోంది. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో వాణిజ్య కార్యకలాపాలు నీటిప్రవాహాన్ని మళ్లించి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం లోపల, బయట నీటిమట్టాన్ని తగ్గిస్తున్నాయి. వాటిని పూర్తిగా నిషేధించాలి. కోర్టు ఉత్తర్వుల అమలును వ్యతిరేకిస్తున్న రైతులతో రాష్ట్రప్రభుత్వం చర్చించి వారికి అవగాహన కల్పించాలి. డిసెంబరు 11న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి మూడునెలల్లోపు రాష్ట్రప్రభుత్వం కచ్చితమైన డిజిటల్ మ్యాప్‌లతో ఈ చిత్తడి నేలల సరిహద్దులను క్షేత్రస్థాయిలో ఖరారుచేయాలి. ఆక్రమణలను తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నదీ చెప్పాలి. చిత్తడి నేలలను సరిగా సంరక్షించడం లేదని కోర్టుకు సమర్పించిన ఫొటోల ద్వారా తెలుస్తోంది. ఈ సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలి" అని ధర్మాసనం రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

### అధికారుల కుమ్మక్కును కొట్టేయలేం

ఈ మొత్తం వ్యవహారంలో అధికారుల కుమ్మక్కును కొట్టి పారేయలేమని న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి వ్యాఖ్యానించారు. ఆక్రమణలు తొలగించినా అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని రాష్ట్రప్రభుత్వానికి జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ సూచించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలుకు స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోందని రాష్ట్రప్రభుత్వం చెప్పిన విషయంలోనూ మెరిట్ ఉందని, అందుకే ఈ మేరకు ఉత్తర్వులు జారీచేస్తున్నామని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టంచేశారు. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదావేశారు. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ గత అక్టోబరులో కోర్టు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి ఇప్పటివరకు 5వేల ఎకరాలకు పైగా ఆక్రమణలు తొలగించామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా అక్కడికి వలసపక్షుల రాక పెరిగిందన్నారు. 3 నెలల్లో మొత్తం సరిహద్దులను నిర్ధారిస్తామని, అందువల్ల తమకు 8 వారాల సమయం ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరఫున అమికస్‌క్యూరీ కె.పరమేశ్వర్ క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు.

# అక్రమాలకు తావులేదు

- మొదటి పేజి తరువాయి

లేదని చెప్పినట్లు తెలియవచ్చింది. ఫార్ములా-ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం మాజీ మంత్రి కేటీఆర్‌ను నిధుల మళ్లింపు, ఫెమా ఉల్లంఘన అంశాలపై ప్రశ్నించారు. ఈడీ సంయుక్త సంచాలకులు రోహిత్ ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం కేటీఆర్‌ను విచారించి ఆయన వాంగ్మూలం నమోదు చేసింది. ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా నిధులు చెల్లించడం, ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశాలకు డబ్బు బదిలీ చేయడంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కేసు నమోదు చేయగా.. ఇందులో నిధుల మళ్లింపు, ఫెమా ఉల్లంఘనలకు సంబంధించి ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కేటీఆర్ తన న్యాయవాదితో కలిసి గురువారం ఈడీ విచారణకు హాజరయ్యారు. అయితే న్యాయవాదిని మరో గదిలో కూర్చోబెట్టి.. కేటీఆర్‌ను విచారించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కార్యాలయంలోకి వెళ్లిన ఆయన సాయంత్రం 6.30 గంటలకు బయటకు వచ్చారు. భోజన విరామం మినహా మిగిలిన సమయమంతా ప్రశ్నించారు.

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ఉద్దేశంతోనే ఫార్ములా-ఈ రేసు నిర్వహణ తలపెట్టామని, ఇలాంటి అవకాశం కొద్ది నగరాలకే వస్తుందని, సమయాభావం వల్ల రెండో రేసు నిర్వహణకు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకోలేదని ఈడీ అధికారులకు కేటీఆర్ చెప్పినట్టు సమాచారం. సమయం మించిపోతుండటంతో నిర్వహణ సంస్థ ఎఫ్ఈవో తొందరపెట్టిందని, గడువులోపు ఫీజు చెల్లించకపోతే హైదరాబాద్‌ను తప్పిస్తారనే ఉద్దేశంతోనే ఆగమేఘాల మీద సొమ్ము చెల్లించాల్సి వచ్చిందని, ఉన్న కొద్దిపాటి సమయంలో మంత్రిమండలి అనుమతి తీసుకోవడం సాధ్యం కాలేదని చెప్పినట్లు తెలిసింది. ఒక్కోసారి అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఇలా చేయడం పరిపాటి అని, గతంలో కూడా అనేక సందర్భాల్లో ఇలా చేశారని పేర్కొన్నట్లు సమాచారం. పురపాలక పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్నందున రేసు నిర్వహణకు సంబంధించిన అన్ని వ్యవహారాలూ తానే పర్యవేక్షించానని ఆయన అంగీకరించారు. రేసు నిర్వహణ, నిధుల చెల్లింపులకు సంబంధించి పురపాలక పట్టణాభివృద్ధి సంస్థకు, ఎఫ్ఈవోకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు పరిశీలిస్తే తెలుస్తుందని, డబ్బు కూడా సరాసరి హెచ్ఎండీఏ నుంచి నిర్వహక సంస్థ ఖాతాలో రూ.46 కోట్లు జమయ్యాయని, ఈ వివరాలు కూడా అధికారికమేనని కేటీఆర్ వివరించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడా అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం జరగలేదని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు వస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ ఇదివరకే విచారించింది. వారి వాంగ్మూలాన్ని కేటీఆర్‌కు చూపించి, ఆయా అంశాలపైనా ప్రశ్నించింది.

### ఈడీ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

కేటీఆర్ విచారణ సందర్భంగా ఈడీ కార్యాలయం ఎదుట భారాస నాయకులు, కార్యకర్తలు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్‌తో పాటు పలు వాహనాల్లో వస్తున్న వీరందరినీ పోలీసు కంట్రోల్‌రూమ్ వద్ద ఆపారు. కేటీఆర్ కారును మాత్రమే అనుమతించారు. అప్పటికే ఆయనతో పాటు అక్కడకు చేరుకున్న పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు వారందర్నీ అదుపులోకి తీసుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సమయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ అనంతరం కేటీఆర్ బయటకు రాగానే పెద్దపెట్టున నినాదాలు చేశారు.

### లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం: కేటీఆర్

ఈడీ, ఏసీబీ కేసుల విషయంలో లై డిటెక్టర్ పరీక్షలకు తాను సిద్ధమని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ముందుకు రావాలని మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. ఇద్దరి మీదా ఏసీబీ, ఈడీ అభియోగాలున్నాయని, రేవంత్‌రెడ్డి ఇల్లు, ఈడీ కార్యాలయం లేదా అనిశా న్యాయమూర్తి ఎదుట ఎక్కడైనా సరే.. లై డిటెక్టర్‌తో విచారిస్తే ఎవరి నిజాయతీ ఏమిటో తెలుస్తుందన్నారు. ఈడీ విచారణకు హాజరైన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "ఏసీబీ 80కి పైగా ప్రశ్నలడిగితే.. ఈడీ 40కి పైగా అడిగింది. రెండు సంస్థలు ఒకటే రకమైన ప్రశ్నల్ని ఏడెనిమిది గంటలపాటు అడిగాయి. దర్యాప్తు సంస్థలు ఎన్నిసార్లు విచారణకు పిలిచినా.. ప్రశ్నలడిగినా.. వాటికి బదులిస్తూ సహకరిస్తా. ఎన్ని పరీక్షలు పెట్టినా నేను సిద్ధమే. రాజ్యాంగం, న్యాయవ్యవస్థను గౌరవిస్తూ నా నిజాయతీని నిరూపించుకుంటా. నన్ను విచారించేందుకు రూ.5 కోట్ల నుంచి 10 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని పత్రికల్లో చూశాను. ముఖ్యమంత్రి కక్ష సాధింపు ధోరణితో ప్రజాధనాన్ని వృథా చేసే బదులు 500 మంది రైతులకు రుణమాఫీ చేయొచ్చు. 2500 మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వొచ్చు. రాష్ట్ర ప్రజలందరూ ప్రత్యక్షప్రసారం చూస్తుండగా ఆయన (సీఎం)కు ఇష్టమైన న్యాయమూర్తి ముందు లై డిటెక్టర్ పరీక్ష పెట్టండి. నిజాయతీ ఎవరిదో తేలుతుంది. నేను తప్పు చేయలేదు.. చేయబోను. దర్యాప్తు సంస్థలకు అదే వివరించా.. తప్పు చేసుంటే రుజువు చేయాలని, ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పా. న్యాయస్థానాల మీద విశ్వాసముంది. తప్పకుండా న్యాయం గెలుస్తుంది" అని పేర్కొన్నారు.

## రింగ్ రోడ్డు సమీపంలోని భూముల్ని ఓ మంత్రి రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారు

రింగ్ రోడ్డు సమీపంలోని 85 ఎకరాల భూమిని ఓ మంత్రి తన కుటుంబసభ్యుల పేరు మీద రాయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఈరోజు ఆయన నాంపల్లి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతనైతే మూడు తరాలుగా అక్కడే ఉంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, శంకర్ పల్లి మండలం మధ్య చాలాకాలంగా భూవి వాదం నడుస్తోందని శంకర్‌పల్లిలోని కొండకల్, రామచంద్రాపురంలోని వెలిమెల గ్రామాల మధ్య మిగిలిన దాదాపు రూ.1,500 కోట్ల విలువైన 85 ఎకరాలను కబ్జా చేసేందుకు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల భూములను కాపాడేందుకే ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తెచ్చామని అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చిన మంత్రి ఇప్పుడు పేద ప్రజల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే పోలీసులను అడ్డు పెట్టుకొని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఒక రంగు పోయి మూడు రంగుల జెండా వచ్చిందే తప్ప ప్రజల బతుకులు మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు కొంతమంది హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న పేదల ఖాళీ స్థలాలను, భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు.

## రేపు చంద్రబాబు ఇంటికి వెళుతున్న అమిత్ షా

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువైన నేపథ్యంలో... రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు, కేంద్ర మంత్రుల పర్యటనలు కొనసాగుతూ ఉన్నాయి. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏపీలో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ క్రమంలో కేంద్ర హోంమంతి అమిత్ షా ఏపీకి వస్తున్నారు. ఈ నెల 18న అమిత్ షా ఏపీకి వస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బీజేపీ అధికారికంగా ప్రకటించింది. తన పర్యటనలో భాగంగా... ఈ నెల 18న (శనివారం) అమిత్ షా ఏపీకి చేరుకుంటారు. ఆ రాత్రి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనతో భేటీ అవుతారు. అమిత్ షాకు చంద్రబాబు హైలెవెల్ డిన్నర్ ఇవ్వబోతున్నారు. అనంతరం అమిత్ షా విజయవాడలోని హోటల్లో బస చేస్తారు. గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం కార్యాలయాలను జనవరి 19న ఆయన ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత చంద్రబాబు దావోస్ పర్యటనకు బయల్దేరుతారు.

## కేసీఆర్ దోచుకున్నడు మేం పథకాలకు మళ్లించాం

- మొదటి పేజి తరువాయి

అతి పెద్ద మెట్రో ను నిర్మించినన ఘనత షీలాదీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కిందని చెప్పారు. సీఎన్జీ విధానాన్ని అముల చేసింది కూడా ఆమేనని అన్నారు. రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణం కూడా అప్పుడే జరిగిందని వివరించారు. కాంగ్రెస్ అంటేనే గ్యారెంటీ అని, హామీలు ఇవ్వడమే కాదు అమలు చేసి చూపుతున్నామని వివరించారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, హామీల అమల్లో ఏమైనా సమస్య ఉంటే తాను తెలంగాణ నుంచి వచ్చి ఇక్కడి ప్రభుత్వానికి అండగా ఉంటానని అన్నారు.

### లిక్కర్ పార్ట్ నర్  ను ఓడించాం:

కేజ్రీవాల్ సర్కారు అవినీతి కూపంగా మారిందని, ఢిల్లీ లిక్కర్ స్కామే ఇందుకు నిదర్శనమని అన్నారు. లిక్కర్ స్కాం పార్ట్ నర్ గా ఉన్న బీఆర్ఎస్ ను తెలంగాణలో ఓడించామని, అసలు సూత్రధారులను ఓడించేందుకు ఇక్కడికి వచ్చామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అంతా జైలు పాలయ్యారని చెప్పారు. ఇక్కడ అవినీతిని నియంత్రిస్తే గ్యారెంటీలు అమలు చేయడం పెద్ద సమస్యే కాదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### కేంద్రంతో పోరాడుతం:

దేశ రాజధానిగా ఉన్న ఢిల్లీ అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంతో పోరాడు తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తమ పార్టీకి లోక్ సభలో వంద మంది ఎంపీల బలం ఉందని, కేంద్రాన్ని నిలదీస్తామని అన్నారు. పార్లమెంటులో బలమే లేని ఆప్ ను గెలిపిస్తే ప్రయోజనం ఉండదని సీఎం అన్నారు.

## ముగిసిన కేటీఆర్ విచారణ...
### 7 గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించిన ఈడీ

ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఈడీ విచారణకు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. ఆరు గంటల తర్వాత ఆఫీస్ నుంచి బయటకు వచ్చారు. ఉదయం 10 గంటల 30 నిమిషాల సమయంలో లోపలికి వెళ్లిన కేటీఆర్.. ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఈడీ నుంచి పలు ప్రశ్నలను ఎదుర్కొన్నారు. విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా ఎలా చెల్లిస్తారని.. కేబినెట్ అనుమతి లేకుండా ఎలా ఆదేశాలు ఇస్తారని ప్రశ్నించారు ఈడీ అధికారులు. ఈ కేసులో 55 కోట్ల రూపాయలను డబ్బును.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా.. ప్రభుత్వ ఖాతా నుంచి ఎలా తరలించారంటూ ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్దంగా రూపాయిలను పౌండ్లలోకి మార్చి.. మరీ చెల్లించటంపై ఈడీ ప్రశ్నల వర్షం కురిపించింది. %ఎవీణూ% ఖాతా నుంచి విదేశీ కంపెనీకి నిధుల బదిలీ, నిధుల బదిలీలో ఫెమా ఉల్లంఘనలపై ప్రశ్నించింది ఈడీ. ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు సుదీర్ఘంగా విచారణ కొనసాగింది. ఈ కేసులో ఈడీ విచారణకు కేటీఆర్ హాజరుకావటం ఇదే ఫస్ట్ టైం. తొలి రోజు విచారణ ముగియటంతో.. ఆఫీస్ నుంచి బయటకు వచ్చారు కేటీఆర్.

## బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి.. ఆరు చోట్ల గాయాలు

బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దుండగుడు దాడిచేశారు. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆయన ఇంట్లోకి ప్రవేశించి కత్తితో ఆయనపై దాడిచేశాడు. ఈ ఘటనలో సైఫ్‌కు ఆరు చోట్ల గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో సైఫ్ చికిత్స పొందుతున్నాడు. ఈ తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సైఫ్ కుటుంబం నిద్రలో ఉండగా ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు చోరీకి యత్నించాడు. అలికిడికి మెలకువ వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసిన సైఫ్‌పై దుండగుడు దాడిచేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సైఫ్ ఇంటికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడి కోసం పోలీసులు వేట ప్రారంభించారు.

## కృష్ణా జలాల విషయంలో ట్రైబ్యునల్ కీలక నిర్ణయం

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన అదనపు టర్మ్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట విచారణ చేపట్టాలని ట్రైబ్యునల్ నిర్ణయించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై తొలుత వాదనలు వింటామని తెలిపింది.811 టీఎంసీలలో రెండు రాష్ట్రాల వాటాను తేల్చడం ముఖ్యమని ట్రైబ్యునల్ పేర్కొంది. మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాలకు కేటాయింపులపై ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని తెలిపింది. ఆ తర్వాత 89వ సెక్షన్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

## ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లకు అనుకూ లంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాలు పెరగనున్నాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి వస్తాయి. త్వరలో కొత్త కమిషన్ కు చైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించనున్నారు.మరోవైపు, శ్రీహరికోటలోని షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనున్నారు. ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలకు అనుగుణంగా మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎన్‌జీఎల్‌వీ ద్వారా భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది.

## పార్టీ మారిన పది మందిపై అనర్హత వేయండి..

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రిట్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చి ఆరు నెలలు పూర్తి అయినా ఇప్పటికీ స్పీకర్ ఎలాంటి చర్యలకు ఉపక్రమించ లేదని బీఆర్ఎస్ పిటిషన్లలో పేర్కొంది.
కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని తెలిపింది. గతంలో కేశం మేఘాచంద్ర కేసులో ఇచ్చిన తీర్పు అమలు చేయాలని గులాబీ పార్టీ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ ప్రస్తావించింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ కేసు విషయంలో న్యాయవాదులతో చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీకి వచ్చారు. ఆయన తెలిపిన వివరాల ఆధారంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

## యంగ్ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి రూ.25 లక్షల చెక్ అందించిన సీఎం చంద్రబాబు

ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో తన ఆల్ రౌండ్ నైపుణ్యంతో అదరగొట్టిన ఆంధ్రా క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి నేడు సీఎం చంద్రబాబును కలిశాడు. తండ్రి ముత్యాలరెడ్డితో కలిసి నితీశ్ నేడు ఉండవల్లి వచ్చాడు.
చంద్రబాబు చేతుల మీదుగా రూ.25 లక్షల చెక్ అందుకున్నాడు.ఆస్ట్రేలియా టూర్లో నితీశ్ కుమార్ రెడ్డి వీరోచితంగా ఆడి సెంచరీ నమోదు చేయడం తెలిసిందే. దాంతో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అతడికి రూ.25 లక్షల నజరానా ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆ నజరానా చెక్ ను నితీశ్ కుమార్ రెడ్డికి అందించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు.
"విశేష ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ మన నితీశ్ కుమార్ రెడ్డిని నేడు కలిశాను. తెలుగు సమాజం నుంచి వెలుగులు విరజిమ్ముతున్న నికార్సయిన ధ్రువతార నితీశ్. తన ఆట ద్వారా ప్రపంచ వేదికపై భారత్ కు గర్వకారణంలా నిలిచాడు. నితీశ్ కెరీర్ ను తీర్చిదిద్దడంలో మద్దతుగా నిలుస్తున్న అతడి తల్లిదండ్రులను అభినందించాను. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని సెంచరీలు సాధించాలని, మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. అంతేకాదు, నితీశ్ తనను కలిసిన ఫొటోలు కూడా పంచుకున్నారు.

# కొత్తగూడెం ఎయిర్ పోర్టు స్థల పరిశీలనకు ఈ నెల 23న రాక.

- గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు సాధ్యాసాధ్యల పరిశీలన.
- పాల్వంచ, కొత్తగూడెంలో పలు ప్రాంతాలలో పర్యటన .

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 16,**ఈనెల 20న ఎయిర్ పోర్టు స్థల పరిశీలన కోసం రావాల్సిన కేంద్రబృందం 23వ తేదీన పర్యటిస్తుందని మంత్రి తుమ్మల తెలియచేశారు. నిన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చరవాణిలో కేంద్ర బృంద పర్యటన కోసం చర్యలు తీసుకోవాలని కోరగా, ఈ నెల 23న జిల్లాకి బృందాన్ని పంపించేల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ బృందం పాల్వంచ కొత్తగూడెం ప్రాంతాలలో పర్యటిస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కొత్తగూడెం పాల్వంచ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం పలు భూములు గుర్తించామని అక్కడ సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు లేఖ రాశారు. అంతే కాకుండా ఈ సర్వే కోసం నిధులు కూడా మంజూర య్యాయని (జీవో నెం.5, తేది:04.01.2025 జతచేయడమైనది), అలాగే జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి పలు అనువైన ప్రాంతాలను గుర్తించామని, ఆ ప్రాంతాల సాధ్యాసాధ్యాలు నిర్ధారించేలా సర్వే వెంటనే చేపట్టాలని కోరారు.

**23న ప్రత్యేక బృందం జిల్లాలో పర్యటన...**

మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు 6గురు సభ్యుల ప్రత్యేక బృందం వస్తున్నట్లు వెల్లడించారు. ఈ బృందంలో ఏరో ప్లానింగ్ ఇంజనీర్ అబ్దుల్ అజీజ్, అర్క్ టెక్ మహ్మద్ సఖీబ్, ఆపరేషన్స్ ఇంజనీర్ ప్రశాంత్ గుప్తా, సి.ఎన్.ఎస్ ఆర్. దివాకర్, ఇంజనీర్ మనీష్ జోన్వాల్, ఎఫ్.పి.డి ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ వస్తున్నట్టు తెలిపారు.
ఈ బృందం పర్యటనకు కావలసిన అన్ని ఏర్పాట్లు చూడాలని, వారు కోరిన రెవిన్యూ డిపార్ట్మెంట్ (భూ సేకరణ), ఫారెస్ట్, వాటర్ రిసోర్సెస్ మరియు ఏవియేషన్ బృందాన్ని వారికి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని మంత్రి తుమ్మల ఆదేశించారు. వారి పర్యటనలో భాగంగా సదరు బృందానికి వారు కోరిన సమాచారం ఇచ్చేలా సంబంధిత విభాగాలు సిద్ధంగా ఉండాలని, వారి పర్యటనకు కావాల్సిన ఏర్పాట్లను రెవెన్యూ యంత్రాంగం సిద్ధం చేయాలని కోరారు. విమానాశ్రయం తో రూపురేఖలు మారనున్న కొత్తగూడెం...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం పాల్వంచ ప్రాంతాల రూపు రేఖలు మారుతాయన్నారు. వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా, పారిశ్రామికపరంగా జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుందన్నారు. దక్షిణయోధ్యగా పేరొందిన భద్రాచలం ప్రాంతానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు సైతం వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

**కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు...**

జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు కోసం సహకరిస్తున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రివర్యులు అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారని, అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు

## కులమతాలకతీతంగా జరిపే పండుగ సంక్రాంతి.

- రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల.
- బుధవారం రాత్రి కొత్వాల ఇంటి వద్ద సంక్రాంతి వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 16,**పాత పాల్వంచలోని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఇంటి వద్ద పాల్వంచ ప్రజలు సంక్రాంతి సంబురాలు జరిపారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా బుధవారం అర్ధరాత్రి కొత్వాల ఇంటి వద్ద కనుమ వేడుకలు నిర్వహించారు. స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు ఎండి మస్తాన్ ఖురేషి ఆధ్వర్యంలో కొత్వాల ను శాలువా, పులా దండలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపి, మత సామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ మైనారిటీ నాయకులు మతాలకతీతంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, వేడుకల్లో పాల్గొనడం మత సామరస్యాన్ని చాటుతుందన్నారు. సంక్రాంతి పండుగ ప్రజలందరినీ భోగ భాగ్యాలతో, కొత్త వెలుగులు నింపాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో ముస్లిం మైనారిటీ నాయకులు ఎం డి అఖిమ్ ఖురేషి, ఎం డి నాయక్ ఖురేషి, ఎం డి అబ్దుల్ నబీ, ఎం డి సాజిత్, కుక్కలా రవి, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## మరుపురాని మచ్చలేని మనిషి కీ"శే" యడారి సీతారాములు ( సీతయ్య).

భద్రాచలం లో ఒకే విద్యాసంస్థ లో 50 సంవత్సరాల మహా ప్రస్థానం.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 16,**భద్రాద్రి జిల్లా భద్రాచలం లో గత 75 సంవత్సరాలుగా భద్రాచల పరిసర ప్రాంతవాసులకు అందరికీ పరిచయస్తులుగా పేరుగాంచిన యడారి సీతారాములు (సీతయ్య) భద్రాచలం తాత గుడి సెంటర్ నందు నివసిస్తూ భద్రాచల స్థానిక ఓ ప్రైవేటు విద్యాసంస్థలైన లిటిల్ ఫ్లవర్స్ లో ఒక మూల స్తంభంగా( పిల్లర్), యాజమాన్యానికి ఒక వ్యక్తిగత సహాయకుడిగా, మరియు బోధనేతర సిబ్బంది గా మొత్తంగా 60 సంవత్సరాలు పైబడిగా పని చేస్తూ కొన్ని వేలమంది విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల ఆశీర్వాద బలంతో అనేక మన్ననలను పొంది, యాజమాన్యం పట్ల చిత్తశుద్ధితో విద్యాసంస్థలు పెట్టినప్పటి నుండి ఈరోజు వరకు 50 సంవత్సర సుదీర్ఘ ప్రయాణంలో నీతికి నిజాయితీకి మారుపేరుగా మచ్చలేని మనిషిగా అందరికీ సహాయం చేసే వ్యక్తిగా చరిత్రలో గుర్తింపు పొందిన ఏకైక వ్యక్తి. యాజమాన్యాని కి కీర్తిశేషులు మాగంటి సూర్యం కి విద్యాసంస్థలు లేనప్పటి నుండి వారి వద్ద పనిచేస్తూ ఇప్పటివరకు కూడా వారినే నమ్ముకుని ది 13.12.2024 తనువు చాలించిన కీ.శే. యడారి సీతారాములు (సీతయ్య) ఒకె విద్యాసంస్థలో మూడు తరాలుగా పనిచేస్తూ భద్రాచలంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి, ఒకె విద్యాసంస్థ లో 50 సంవత్సరాలుగా పనిచేయడం అనేది మామూలు విషయం కాదని ఈ విషయంలో ఆయన చరిత్ర తిరిగి రాయగలిగేవాడు లేడని ఆయన మరణం విద్యా సంస్థల యాజమాన్యానికి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని ఆయనపై ప్రేమతో అభిమానంతో కన్నీటి పర్యంతమై అంటున్న విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, భద్రాచల అభిమానులు, పుర ప్రముఖులు మరియు మండల ప్రజలు.

## శ్రీకృష్ణుని సన్నిధిలో ఘనంగా రాపత్తు ఉత్సవం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 16,**భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం లో రాపత్తు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. డిసెంబర్ 31 నుంచి ప్రారంభమైన శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల 10 వరకు పగలు పత్తు ఉత్సవాలు పూర్తవ గా , అనంతరం రాపత్తు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలలో ఏడవ రోజు అయిన గురువారం శ్రీకృష్ణుని సన్నిధిలో రామయ్యకు రాపత్తు ఉత్సవం జరిగింది. రామాలయం రోడ్డులోని శ్రీకృష్ణుని సన్నిధిలో రాపత్తు ఉత్సవాన్ని నిర్వహించారు. రాపత్తు ఉత్సవంలో స్వామివారు కలింగమర్ధిని అలంకరణలో పూజలు అందుకున్నారు. ప్రధాన ఆలయం నుంచి కోలాటం నృత్యాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీకృష్ణుని సన్నిధికి తీసుకువచ్చిన స్వామివారికి శ్రీకృష్ణుని సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సూదిని జైపాల్ రెడ్డికి ఘన నివాళులు అర్పించిన నూతన గ్రంథాలయ కమిటీ సభ్యులు



**సి కే న్యూస్ షాద్ నగర్ :జనవరి 16:**మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతి సందర్భంగా షాద్ నగర్ నూతన గ్రంథాలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి యొక్క చిత్రపటానికి పూలతో ఘన నివాళులర్పించారు. అనంతర%శ్రీ% ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు వారు చేసిన సేవలను కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో కొప్పుల మదన్మోహన్ రెడ్డి, టీజీ శ్రీనివాస్,నక్క బాల్ రాజ్ యాదవ్,క్యాసెట్ శ్రీనివాస్,జూపల్లి చంద్రశేఖర్,కత్తి చంద్రశేఖర అప్ప, కృష్ణ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

## కొందుర్గు మండలం చెక్కలోని గూడ గ్రామ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ ఫైనల్ విజేతలకు బహుమతులు బహుకరణ

ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేసిన తెలంగాణ రాష్ట్ర బిసి కార్యదర్శి విజయ్ కుమార్



**సి.కె న్యూస్షాద్ నగర్ జనవరి 16:** కొందుర్గు మండలం చెక్కలోని గూడ, లో ప్రీమియర్ లీగ్ సీజన్ 4 కి మేమేటోస్ డొనేట్ చేసిన తెలంగాణ రాష్ట్ర బిసి కార్యదర్శి జి విజయ్ కుమార్. మెమోటోలు డొనేట్ చేసిన సందర్భంగా గ్రామస్థులు క్రికెట్ టీం ఆర్గనైజర్ క్యాపిటల్స్ గ్రామ పెద్దలు కలిసి సన్మానం చేసారు.రాబోయే రోజుల్లో నేను క్రీడాకారులకు విద్యకు గ్రామ అభివృద్ధికి సహకరిస్తాను విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎన్.జంగయ్య జి.ఆంజనేయులు సి.నరేష్ ఎస్.యాదయ్య బి.రాములు ఎన్.చిన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ ను కలిసిన దత్తాయి పల్లి యువకులు.




**సి కె న్యూస్షాద్ నగర్ : జనవరి 16:**షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్(సీఐ)నరహరిని దత్తాయి పల్లి గ్రామానికి చెందిన యువకులు సంక్రాతి పండుగ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు.సీఐ ను కలిసిన వారిలో కానుగుల రవి ముదిరాజ్,మామిడిపల్లి శ్రీపాల్,కాసన్న గారి కృష్ణ,మామిడిపల్లి నర్సింలు ఉన్నారు.

# మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం....

**శ్రీరంగాపురం మండలం జనవరి /16 (సి కె న్యూస్ )**తాటిపాముల గ్రామం, శ్రీరంగాపూర్ మండలం, వనపర్తి జిల్లా...
మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి జిల్లాలో చెలరేగుతున్న మైనింగ్ మాఫియ
తాటిపాములలో అనుమతులు లేకుండా ఎదేచ్చగా బ్లాస్టింగ్
బ్లాస్టింగ్ ధాటికి ఇండ్లకు బీటలు
పిల్లలు, గర్భిణీలు, వృద్ధుల ప్రాణాలకు ముప్పుప్రజల జీవితాలకు మరియు ఆస్తులకు రక్షణ కల్పించాలి
బిసి పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్,
అక్రమ మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని బిసి పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.
గురువారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న ప్రాంతాన్ని మరియు బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇండ్లను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ బి ఆర్ క్రషర్ యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎదేచ్చగా బ్లాస్టింగ్ చేస్తున్నా కూడా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ అక్రమ మైనింగ్ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు.
గ్రామంలో సంవత్సరాలుగా అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్నారని, దీంతో ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామంలోని ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయంతో జీవిస్తున్నారని అన్నారు.
బ్లాస్టింగ్ శబ్దానికి పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, గుండె జబ్బులు ఉన్న వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం



ఉందన్నారు.
అక్రమ మైనింగ్ మరియు బ్లాస్టింగ్ కార్యకలాపాలు స్థానిక పర్యావరణ వ్యవస్థకు కోలుకోలేని నష్టాన్ని కలిగించే అవకాశం ఉందన్నారు
అనుమతుల గురించి జిల్లా మైనింగ్ అధికారి, స్థానిక తహసీల్దార్ మరియు ఎస్సై లకు ఫోన్ చేసి అడగగా బ్లాస్టింగ్ చేయడానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారని అన్నారు.
సరైన అనుమతులు లేకుండా, భద్రతా చర్యలు లేకుండా నిర్వహిస్తున్న అనధికార బ్లాస్టింగ్ కార్యకలాపాలను నిలిపివేసి, తాటిపాముల గ్రామంలోని నివాసితుల జీవితాలకు మరియు ఆస్తులకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్, దేవర శివ, జితేందర్, మాజీ సర్పంచ్ బజారయ్య, నాగరాజు యాదవ్, వెంకటయ్య, పోషన్న, సుబద్రమ్మ, వెంకటమ్మ, సుశీలమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొక్కంపాడు లో సంక్రాంతి సంబరాలు


**ఘనంగా రంగవల్లులు,ముగ్గుల పోటీలు,వాలిబాల్, కబ్బడి పోటీలు.**

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 16,**
మొక్కంపాడు తండా యూత్ కమిటీ బానోత్ రవి టీచర్ , పి. సి భూక్యా అబ్బాస్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాలో సంక్రాంతి పండుగ, కనుమ పర్వదినం సందర్బంగా ముగ్గుల పోటీలు,వాలీబాల్, పోటీలో నిర్వహించడం జరిగింది ఈ పోటీలకు ముఖ్యఅతిధిగా రెడ్డి రౌతు రత్నరావు బ్రదర్స్, టీచర్ బానోత్ రవి, గ్రామ పెద్దలు బానోత్ వాలునాయక్, మోతిలాల్ నాయక్ మాలోత్ రాందాస్ నాయక్,బానోత్ సురేష్ హాజరు అయి పాల్గొన్నారు యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండేలా జనవరి మాసంలో రైతుల ఇళ్లకు ధన ధన్యా రాషులు వచ్చి చేరేతాయి కావునా ఈ సమయంలో వచ్చే సంక్రాంతి పండుగను వరుసుగా మూడు రోజులు జరుపుకుంటారు అని మొదటి రోజు కామ బోగి, రెండోవ రోజు సంక్రాంతి, ముడో రోజు కనుమ(పశువుల పండుగ )జరుపుకుంటారు అని వారు అన్నారు ఈ విధమైన ఆటలతో మొక్కంపాడు తండా ప్రజానీకం పండుగ వాతావరణం శోభాయమనంగా వినోదం కలిగిస్తూ వినోదం పంచేలా అల్లుకోవడం జరిగింది ఈ పోటీలు విజయవంతం అవ్వడం సహకరించిన మేనేజ్మెంట్ బానోత్ రవి, దారావత్ గావస్కర్, భూక్యా సుభాష్ నాయక్,బానోత్ హుస్సేన్ %జ%. మహేష్ ,తండా యువతకు ధన్యవాదాలు చెప్పడం జరిగింది. వివిధ పోటీలో పాల్గొని విజయం సాధించిన విజేతలకు బహుమతులు, ప్రైజ్ మని అందజేయడం జరిగింది..ముందుకు వచ్చి ప్రైజ్ మని, బహుమతులు ఇచ్చిన దాతలకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేయడం జరిగింది.





# ధన కోట మైసమ్మ గుడి నిర్మాణానికి విరాళం ఇచ్చిన సురేందర్


విరాళం ఇచ్చిన షాద్ నగర్ కలం నిఘా రిపోర్టర్ జంగిలి సురేందర్

**సి కె న్యూస్ షాద్ నగర్: జనవరి 16:**నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ధన కోట మైసమ్మ తల్లి గుడి నిర్మాణానికి బుదవారం నాడు గ్రామానికి సంబంధించిన జంగిలి కిష్టయ్య కుమారుడు జంగిలి సురేందర్ ( షాద్ నగర్ కలం నిఘా రిపోర్టర్) దంపతులు తమ వంతు సహాయంగా రూ 5116 /- ఐదు వేల నుట పదహారు రూపాయలు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ...శరీరం, మనస్సు, భావోద్వేగాలు మరియు శక్తులను ఒక నిర్దిష్ట స్థాయి పరిపక్వతకు పెంపొందించుకుంటే, మీలో ఇంకేదో వికసిస్తుంది – అదే ఆధ్యాత్మికత అని అన్నారు. మీ హేతువు అపరిపక్వంగా ఉన్నప్పుడు, అది ప్రతిదానిని అనుమానిస్తుందని, మీ హేతుబద్ధత పరిపక్వం చెందినప్పుడు, అది ప్రతిదీ పూర్తిగా భిన్నమైన కాంతిలో చూస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సృష్టిలో ఆధ్యాత్మికతకు ఉన్న శక్తి మరొకటి లేదని అన్నారు.ఎంతో భక్తిశ్రద్ధలతో గ్రామ పెద్దలు స్థానిక నాయకులు యువకులు తదితరులు ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయం చేయాలని అన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాల ముగింపు ఉత్సవ కార్యక్రమం...

**అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సామర్తి జగన్..**

**యాచారం జనవరి 16 సి కే న్యూస్** మండల పరిధిలోని. చింతుల్ల గ్రామంలో లో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షత సామర్తి జగన్ గారు వహించడం జరిగింది క్రీడలకు సంబంధించి నిన్న బహుమతి ప్రధానోత్సవం అట్టహాసంగా ఏర్పాటు చేయడం జరిగింది ఈ క్రీడలు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మరియు మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. నిన్న రాత్రి బహిరంగ సభ ఏర్పాటు చేసి క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సామర్తి జగన్ గారు..మాట్లాడుతూ గ్రామంలో యువతీ యువకులు స్నేహపూర్వకంగా పార్టీలకతీతంగా గ్రామ మొత్తంలోని అన్ని అన్ని యువజన సంఘాల తరఫున పాల్గొనడం ఐక్యతకు నాంది అని మరియు అంబేద్కర్ యువజన సంఘం కేవలం క్రీడలు మాత్రమే కాకుండా గ్రామ అవసరాలకు అనుగుణంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది ఈ యువజన సంఘం 1978లో రిజిస్ట్రేషన్ చేయబడింది నాటీ నుంచి నేటి వరకు పలు కార్యక్రమాలు శ్రమదాన కార్యక్రమాలు రక్తదాన ఏర్పాట్లు కరోనా సమయంలో 18 క్వింటాళ్ల రైసు గ్రామ ప్రజలకు అంబేద్కర్ యువజన సంఘం తరఫున పంపిణి చేయడం జరిగింది అదేవిధంగా అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఇలా మొన్న గత మూడు సంవత్సరాల క్రితం గుమ్మడవెల్లి రోడ్డు కు తార్ రోడ్డు వేయవలసిందిగా ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగింది అది సాధించుకోవడం జరిగింది. ఈ విధంగా అనేక కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్న అని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు యువతీ యువకులు అందరు పాల్గొనడం జరిగింది కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సామర్థ్య జగన్ కార్యదర్శి మస్కు రవీందర్ అంబేద్కర్ సంఘం కార్యదర్శి నాగానీ గోపాల్ డివైఎఫ్ఐ అధ్యక్షులు మస్కు రుపేందర్ , కార్యదర్శి మస్కు భగత్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కే వికాస్ కార్యదర్శి సామర్థ్య వంశీ నాయకులు ఎం జె వినోద్ కుమార్ జానపద వృత్తి కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు కె అరుణ్ కుమార్ గారు ప్రముఖ న్యాయవాది అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు మాస్కు సంజయ్ కుమార్ సలహాదారులు నాగ ని బుగ్గ రాములు రైతు సంఘం నాయకులు మస్కు జంగయ్య అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు కే వినోద్ కుమార్ అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు అలాగే గంధం రాఘవేందర్ , నాగని సుధాకర్ , నాగని నాగేష్ సామర్తి జంగయ్య, సామర్తి అభిలాష్,మాజీ ఉపసర్పంచ్ కొనింటి ఈశ్వర్, %వఇ% ఉపసర్పంచ్ ,నాగని రాందాస్, భవాని యూత్ అధ్యక్షులు కంక్కర్ల రమేష్ మరియు యువజన సంఘాలు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

# ట్రస్ట్ సభ్యులను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**చంద్రగిరి,జనవరి15 సి కే న్యూస్** పాకాల మండలం దామలచెరువుపంచాయతీ పత్తిపాటి వారి పల్లిలో మహాప్రస్థానా ట్రస్ట్ ద్వారా నిర్మించిన "హెల్త్ కేర్ ఎటిఎం సెంటర్ "గురించి విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ట్రస్ట్ సభ్యులను అభినందించారు. నారావారిపల్లి లోని నివాసంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వివరించడం జరిగింది, ట్రస్టు సభ్యుల్ని అభినందించడమే కాకుండా ప్రభుత్వం నుండి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

# క్రికెట్ ఫైనల్స్ విజేతలకు బహుమతులు అందించిన ఎమ్మెల్యే పులివర్తి నాని






**చంద్రగిరి,జనవరి16 సి కే న్యూస్** పాకాల మండలం మద్దినాయనపల్లి పంచాయతీ మద్దినాయనపల్లి గ్రామంలో సంక్రాంతి ఉత్సవాలలో నిర్వహించిన కూటమి క్రికెట్ ఫైనల్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరైనారు.మద్దినాయనపల్లికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం మద్దినాయనపల్లి గ్రామంలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కూటమి క్రికెట్ ఫైనల్స్ ను ఎమ్మెల్యే పులివర్తి నాని వీక్షించారు.కూటమి క్రికెట్ ఫైనల్స్ విజేతలకు విన్నర్లకు 9,999 రూపాయలు, రన్నర్లకు 7,777కు నగదును ఎమ్మెల్యే పులివర్తి నాని బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి క్రికెట్ ఫైనల్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మల్లికార్జున, గోపినాథ్ రెడ్డి, హరీష్, గ్రామస్తులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అండర్ 14 క్రికెట్ టీం లో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్



- అబ్దుల్ సాద్ ను అభినందించిన పలువురు క్రీడాకారులు.
- మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష.

**బాపట్ల సి కే న్యూస్** రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్ టీంలో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ కు అవకాశం దక్కింది. అండర్ 14 రాష్ట్ర క్రికెట్ టీంలో ఎంపికైన అబ్దుల్ సాద్ ఉనైస్ ను ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు. క్రీడా రంగాన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు..ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 స్టేట్ టీం లో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాధ్ ఉనైస్ కు అవకాశం దక్కటం అభినందనీయమని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రఘునాథ్ అన్నారు. గత నెలలో జరిగిన అండర్ 14 జిల్లాస్థాయి ఎంపికల్లో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా టీం లో ఫాస్ట్ బౌలర్ గా ఎంపిక ఎంపికయ్యారు. కృష్ణ, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం,శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాలతో జరిగిన పోటీల్లో తన ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. విద్యార్థి అబ్దుల్ సాద్. వివిధ జిల్లాల్లో జరిగిన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో విశేషమైన ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర అండర్ 14 క్రికెట్ టీం లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారుల్లో ఈ బాపట్ల విద్యార్థి స్థానం దక్కించుకున్నాడు. చివరిగా విజయనగరంలో జరిగిన జోనల్ పోటీల్లో 17 మంది తో కూడిన రాష్ట్ర అండర్ 14 క్రికెట్ టీం ఎంపిక చేశారు. అందులో అబ్దుల్ సాద్ కూడా ఒకరు కావడం విశేషం.ఈ నెల 27వ తేదీ నుండి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరి లోజరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 మ్యాచ్ లో అబ్దుల్ సాద్ పాల్గొనబోతున్నారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన అబ్దుల్ సాద్ ను ఉత్తమ క్రీడాకారుడుగా తీర్చిదిద్దటంలో కృషిచేసిన
కోచ్ అమీర్ ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అభినందన సభలో పలువురు క్రీడాకారులు మాట్లాడారు. ఎంతోమంది క్రీడాకారుల కేంద్రంగా ఉన్న బాపట్లలో క్రికెట్ రంగాన రాణించే ప్రతిభగల విద్యార్థుల కోసం వసతులు కల్పించాలని పలువురు క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. పూర్తిస్థాయిలో క్రీడాకారులకు సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని పేర్కొన్నారు. నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి బాపట్ల ను క్రీడా హబ్ గా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, స్టాన్లీ విమల్ కుమార్ ,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ పరిశీలించిన కమిషనర్ రఘునాథరెడ్డి





**బాపట్ల సి కే న్యూస్ :**బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని సూర్యలంక రోడ్డులో గల అన్న క్యాంటీన్ అధికారులతో కలిసి మునిసిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి పరిశీలించారు.అన్న క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు, అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ ఆహారం యొక్క నాణ్యతను,త్రాగునీరు కల్పించిన సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెన్నెలకంటి నగర్,శారదాపురి కాలనీ నందు పర్యటించి అర్బన్ హెల్త్ సెంటర్ వైపు వెళ్ళు రోడ్డు నిర్మాణ పనుల గురించి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో మాట్లాడారు. త్వరితగతన అంచనాలు తయారు చేసి రోడ్డు పనులను పూర్తి చేయాలని వారికి సూచించారు. మల్లికార్జున బృందావనం వైపు వెళ్ళు రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించి త్వరితగతన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వారి వెంట మునిసిపల్ ఇంజనీర్.కృష్ణా రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్. జి. ప్రసాద్, రెవిన్యూ అధికారి.అబ్దుల్ జబ్బార్ ఉన్నారు.

## భారీగా మద్యం అమ్మకాలు..?

రాష్ట్రంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్న వేళ కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడల్లో కోట్లు చేతులు మారుతున్నాయి. డబ్బులు వచ్చిన వారు ఆనందంతో ఇళ్లకు వెళు_న్నారు. డబ్బులు పోయినవారు దుఃఖంతో ఇంటికి వెళ్తున్నారు. భోగి రోజున ప్రారంభమైన కోడి పందేలు, పేకాట, గుండాట రాత్రి పగలు తేడా లేకుండా నిరాటంకంగా కొనసాగుతోన్నాయి. అక్కడే భోజనం, మందు, నీళ్లు, ఇతర తినిబండరాళ్లు స్టాల్స్ పెట్టి అమ్మడంతో పందె రాయుళ్లు, జూద క్రీడలు ఆడేవారు అక్కడ నుంచి వెళ్లటం లేదు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించింది. దీంతో రాష్ట్రంలోని విచ్చల విడిగా బెల్ట్‌షాప్‌లు పుట్టుకొచ్చాయి. ఈ సంక్రాంతి వేళ కొత్తగా సంతలో స్టాల్స్ మాదిగా మద్యం స్టాల్స్ వచ్చాయి. కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి మరి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోంది. స్టాల్స్ పెట్టి మద్యం అమ్మేవారికి స్థానిక అధికార పార్టీ నేతలు అండదండలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. పైగా కోడి పందేల బరుల నిర్వాహకులు కూడా వీరికి మద్దతుగా నిలవడంతో ఎవరు ఏమీ అనడం లేదు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా వారి జోలికి పోవటం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. కోడి పందేల బరుల వద్ద భారీగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దేవిపట్నం మండలంలోని ఎం.రావిలంక గ్రామ శివార్లలో మామిడ తోట వద్ద జోరుగా కోడి పందేలు, నంబర్ గుండాట జరుగుతోంది. అక్కడ కోడి పందేలు ప్రాంగణంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ తరహాలోనే మద్యం సీసాలు పెట్టి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. బహిరంగంగా మద్యం అమ్మే వారిలో మహిళలు కూడా ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క భోగి రోజే అధికారిక లెక్కల ప్రకారం రూ.28.40 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇంకా సంక్రాంతి, కనుమ రోజుల లెక్కలు చూస్తే? మరింత పెరుగుతుంది. కాకినాడ జిల్లాలో రూ.11.25 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.7 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.10.15 కోట్ల మద్యాన్ని ఆయా జిల్లాల్లోని ఉన్న దుకాణాలు కొనుగోలు చేశాయి. గతేడాది భోగి రోజు రూ.12.60 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అంటే గతేడాది కంటే ఈసారి రూ.15.80 కోట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా డిస్టలరీల స్టోర్లు విక్రయించిన లెక్కల ప్రకారమే. అయితే అక్రమంగా మద్యం ఏరులై పారడంతో ఈ లెక్క మారుతుంది. మద్యం ఒక్కటే కాదు సారా కూడా పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి?!


## కనిపించని ప్రతిపక్షం

ఏ అవకాశం వచ్చినా అంది పుచ్చుకోవాలి. అదే రాజకీయం. చంద్రబాబు ను చూసైనా నేర్చుకుంటారా? అంటే అదీ లేదు. ఎందుకంటే నాలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి నేటి తరం రాజకీయ నేతలు, పార్టీ అగ్రనేతలు ఎన్నో నేర్చుకోవాలి. చంద్రబాబు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. దేనినీ వదలిపెట్టరు. ఎటూ ఆయనకు మీడియా మద్దతు ఉంది కాబట్టి ఇక తాను అనుకున్నది చేసుకుని ముందుకు వెళతారు. ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేకతను ప్రభుత్వంపై తేవడంలో చంద్రబాబును మించిన వారు మరొకరు లేరు. గతంలో ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన సమరాన్ని చూసి కూడా నేడు వైసీపీ నేతలు నేర్చుకోలేకపోతున్నారు. చంద్రబాబు నాయుడు వచ్చిన ఏ అవకాశాన్ని జారవిడుచుకోరు. గతంలో సంక్రాంతి వచ్చిందటే చాలు.. భోగి నాడు నాటి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పండగ చేసుకునే వారు. ప్రభుత్వ ఉత్తర్వులను అందులో దహనం చేసేవారు. ఒక ఏడాది మూడు రాజధానుల ఉత్తర్వులు.. మరొక ఏడాది చెత్త పన్ను ఉత్తర్వులు.. ఇంకొక ఏడాది విద్యుత్తు బిల్లులు.. మరో ఏడాది నాసిరకం మద్యం ఇలా ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెళ్లేవారు. ఇక చివర ఏడాది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కు సంబంధించిన ఉత్తర్వులను కూడా భోగిమంటల్లో వేసి దగ్ధం చేసి మరీ ప్రజలకు చేరువయ్యారు. అందుకే ఆయనను ప్రజలు ఆదరించారు. సంక్రాంతి నాడు సెంటిమెంట్ ను పట్టించుకోకుండా కేవలం పొలిటికల్ ఆయింట్ మెంట్ ను పూసి మరీ ఆయన జనంలోకి చొచ్చుకెళ్లారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. కానీ సంక్రాంతి నాడు చేసింది శూన్యం. ఎవరింట్లో వారు నేతలు పండగ చేసుకున్నారు తప్పించి జనంలోకి వచ్చి సమస్యలను ప్రస్తావన తేలేకపోయారు. ఇది పూర్తిగా జగన్ వైఫల్యంగానే చూడాలి. ఎందుకంటే కనీసం గతంలో చంద్రబాబును చూసైనా జగన్ నేర్చుకోలేదనిపిస్తుంది. అలాగే జగన్ కు చెప్పేవారు కూడా ఎవరూ లేరనే అనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదు. అలాగే విద్యుత్తు బిల్లులను పెంచారు. కానీ జగన్ పార్టీ మాత్రం భోగి మంటలు చేసుకుంది. కానీ పిడకలు వేసి కానిచ్చేసింది. ఇలా ఉంటే ఇక జనంలోకి ఎలా వెళతారు సామీ అని సొంత పార్టీ క్యాడర్ ప్రశ్నిస్తుంది. అంది వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవడంలో జగన్ కు మించిన వారు మరొకరు లేరంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## చిరంజీవిపై కమలం గురి...

మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యంపార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడిగా మారారు. కానీ చివరికి రాజకీయాలపై అసంతృప్తితో వైదొలిగారు . తన రాజ్యసభ సభ్యత్వం ఇంకా రెండేళ్లు ఉన్నప్పటికీ ఆయన సభాసమావేశాలకు కూడా హాజరు కాలేదు. తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరమని ప్రకటించారు. సోదరుడు పవన్ కల్యాణ్‌కు మద్దతు పలికారు. అయితే చిరంజీవిపై బీజేపీ ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తోంది. ప్రత్యేక ప్రాధాన్యత ను ఇచ్చి ఆయనను రాజకీయాల్లోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది. గతంలో పలు మార్లు ప్రధాని మోదీ పాల్గొనే పర్యటనల్లో ఆయనకు అవకాశం కల్పించారు. అదే సమయంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ .. చిరంజీవితో ప్రత్యేక అనుబంధం కొనసాగిస్తున్నారు. గోవాలో ఓ సారి అవార్డు ప్రకటన సందర్భంగా.. మళ్లీ రాజకీయాల్లోకి వస్తారా అని అనురాగ్ ఠాకూర్ అడిగారు కూడా . అయితే చిరంజీవి మాత్రం నిర్మోహమాటంగా...తాను మళ్లీ ప్రత్యక్షరాజకీయాల్లోకి వచ్చేది లేదని స్పష్టం చేశారు. మధ్యలో వైసీపీ కూడా కూడా ఆయనకు రాజ్యసభ సీటు ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. దాన్ని చిరంజీవి కూడా ఖండించారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానని చెప్పారు. అయినా బీజేపీ మాత్రం ఆయనను ఆకర్షించడానికి అదే ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీ నివాసంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు.. చిరంజీవిని అతిథిగా ఆహ్వానించారు. ప్రత్యేకంగా ఆయననే ఆహ్వానించడం వెనుక ప్రత్యేకమైన సమీకరణాలు లేవని అనుకోలేమని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బీజేపీ ఎం చేసినా పూర్తి స్థాయిలో రాజకీయ కోణంలోనే చేస్తుంది. ఇటీవల చిరంజీవికి రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సీటు వస్తుందన్న ప్రచారం జరిగింది. రాష్ట్రపతి కోటాలో ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వడానికి.. రాజకీయ పార్టీల్లో చేరాల్సిన అవసరం లేదు. బీజేపీలో చేరాల్సిన అవసరం లేదు. రాష్ట్రపతి వివిధ రంగాల్లోని నిపుణులను రాజ్యసభకు నామినేట్ చేసే కోటా అది. అయితే కేంద్రం సిఫారసు మేరకే నామినేట్ చేస్తారు. గతంలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ చిరంజీవిపై బీజేపీ ప్రత్యేక అభిమానం చూపిస్తున్నందున కళాకారుని కోటాలో ఆయనకు చాన్స్ ఇవ్వొచ్చని చెబుతున్నారు. అయితే దీనికి చిరంజీవి అంగీకరిస్తారా లేదా అన్నది కూడా కీలకమే. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ తీసుకుంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నట్లుగా కాదు.

# టీడీపీ- జనసేన మధ్య విభేదాలు ఉన్నాయా



దేశంలో వన్ నేషన్ – వన్ ఎలక్షన్ గురించి చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రా రాజకీయాలు ఊహించని టర్న్ తీసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇంకా ఏడాది కూడా కాలేదు. అప్పుడే చీలిక వచ్చే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అందుకు కారణం గతంలో, తాజాగా పరిణామాలపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలేననే చర్చ జరుగుతోంది.

1.ఈనెల 8న తిరుపతిలో తొక్కిసలాట జరిగింది. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈఘటనపై టీడీపీ చీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు దూకుడు వైఖరిని ప్రదర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం టోకెన్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. తొక్కిసలాట జరగడానికి కారణం ఇదేనని వ్యాఖ్యానించారు. కానీ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇందుకు విరుద్ధంగా స్పందించారు. ఈ విషాదానికి కారణమైన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

2.ఈ ఘటనపై ఆరాతీసిన ప్రభుత్వం.. అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఘటన జరిగినప్పుడు పర్యవేక్షించిన డీఎస్పీ రమణ కుమార్, టీటీడీ శ్రీ వెంకటేశ్వర గోసంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథ్ రెడ్డి ఇద్దరినీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత కూడా మరికొందరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇక్కడితో వివాదం ముగిసిందని అంతా అనుకున్నారు.

3.గతేడాది సెప్టెంబర్‌లో తిరుపతి లడ్డూ వివాదం జరిగింది, ఈ వివాదంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును 'స్వచ్ఛమైన' నెయ్యితో కలపడానికి అనుమతించారని టీడీపీ, జనసేన ఆరోపించాయి. కచ్చితమైన ఆధారాలు లేనప్పటికీ.. పవన్ కళ్యాణ్ కాషాయ వస్త్రాలు ధరించి 11 రోజుల దీక్ష చేశారు. సనాతన ధర్మాన్ని అణగదొక్కడానికి జగన్, నకిలీ లౌకిక శక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు.

4. తాజాగా తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో కళ్యాణ్ మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి సహా వేరే ఇతర టీడీపీ నాయకుల నుండి ఇలాంటి డిమాండ్లు రాలేదు.

5.కళ్యాణ్ డిమాండ్ గురించి అడిగినప్పుడు.. టీటీడీ ఛైర్మన్.. క్షమాపణ చెప్పడం వల్ల చనిపోయినవారు తిరిగి రారు. తాము బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాము.. ఎవరో క్షమాపణ కోరారని తాను క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసలు వివాదం ఇక్కడే మొదలైంది.

6.బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో.. జనసేన, బీజేపీ, సంఘ్ పరివార్ – టీడీపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా యుద్ధం మొదలైంది. ఇది పెద్ద వివాదంగా మారకముందే.. టీడీపీ జాగ్రత్త పడింది. పవన్ డిమాండ్ చేసిన రెండు రోజుల తర్వాత.. బీఆర్ నాయుడు క్షమాపణలు చెప్పారు. ఆయన గతంలో ధిక్కార వైఖరిని ప్రదర్శించినప్పటికీ.. ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో క్షమాపణలు చెప్పారని ప్రచారం జరుగుతోంది.

7.ఈ మొత్తం ఎపిసోడ్‌లో పవన్ కళ్యాణ్ రాజకీయ విజేత అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి నిందను పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీపై విజయవంతంగా మోపారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

8.పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యూహాన్ని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మహిళలపై పెరుగుతున్న నేరాలపై స్పందిస్తూ.. డీజీపీ, హోంమంత్రిని విమర్శించారు. బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత హోంమంత్రి తన విధులను సమర్థవంతంగా నిర్వహించలేకపోతే.. తాను హోం మంత్రిత్వ శాఖను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

9.సానుకూల పరిణామాలను పవన్ తన ఖాతాలో వేసుకుంటూ.. లోపాలను సమర్థవంతంగా టీడీపీ ఖాతాలోకి నెట్టేస్తున్నారనే రాజకీయ అభిప్రాయాయలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సమయంలో.. సనాతన ధర్మ రక్షకుడిగా పవన్ తనకు తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు బీజేపీ, ఇటు సంఘ్ పరివార్ పవన్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి.

10.తాజా పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో ఆందోళన మొదలైందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో హిందూ ఓట్ల ఏకీకరకణ, పవన్ కళ్యాణ్, బీజేపీ ప్రభావం పెరగడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో లోకేష్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఓ ప్రముఖ మీడియాలో 'ఉప ముఖ్యమంత్రి' సాంకేతికంగా రాజ్యాంగబద్ధమైన పదవి కాదని, కళ్యాణ్ మంత్రివర్గంలోని ఇతర మంత్రుల మాదిరిగానే ఉంటారనే కథనం వచ్చింది. దీనిపైనా జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో జనసేన వర్సెస్ టీడీపీ ఫైట్ జరుగుతుంటే.. జనసేనకు బీజేపీ, సంఘ్ పరివార్ మద్దతు ఇస్తున్నాయి. ఇందుకే కూటమిలో చీలిక వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

# ఐదు నెలల నుంచి జీతాల్లేవ్

ప్రతిష్ఠాత్మక వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు.. పండగ పూట కూడా పస్తులే ఉంటున్నారు. ఐదు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ.. కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 9,460 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు, 12 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల? ఉన్నారు. వీరికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్ 25 శాతం, నవంబర్‌లో 25 శాతం, డిసెంబర్‌లో 35 శాతం మాత్రమే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగైదు నెలల నుంచి పూర్తిస్థాయి జీతాలు ఇవ్వటం లేదు. హెఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, దసరా, దీపావళి బోనస్‌ను పూర్తిగా ఆపేశారు. వేతన సవరణ జరగలేదు. కార్మికులను సాగనంపేందుకు యాజమాన్యం కుట్రకు తెరతీసింది. కార్మికులను సాగనంపేందుకు సిద్ధమైంది. వీఆర్ఎస్ పథకం అమలుకు ఆర్ఐఎన్ఎల్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్‌లో 45 ఏళ్ల వయసు, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారు వీఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా 2025 మార్చిలోపు వెయ్యి మందిని బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధమైంది. గత ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది 1000 నుంచి 1,100 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. వారిస్థానంలో నియామకాలు జరగటం లేదని సీఐటీయూ నేత కేఎం శ్రీనివాస్ వివరించారు. జీతాల కోత విధింపు, ఉద్యోగులకు జీతాల కోత వంటి చర్యలతో కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మరోవైపు బలవంతగా వీఆర్ఎస్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికి ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని విశాఖ ఉక్కు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితికి కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలే కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్–ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో భాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్క చర్యలు చేపట్టిందిఇప్పటికే దాదాపు 2,000 మంది ఉద్యోగులను ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నర్ స్టీల్‌ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వకుండా కుట్రలు చేసింది. కార్మికులు పోరాటంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్‌ను నిలిపివేసింది. ఆక్సిజన్ ప్లాంట్‌ను నిలిపివేసింది. మళ్లీ కార్మికుల ఆందోళనతో వెనక్కి తగ్గింది. ఇలాంటి కుట్రలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి. తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబందించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్‌మెల్ట్ షాప్, బ్లాస్ట్‌ఫర్నేస్,

రోలింగ్ మిల్స్, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్ధానం చేశారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటి ప్రైవేట్ పరం అవుతుంటే కనీసం స్పందించడం లేదు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన కూడా మౌనం దాల్చడంపై స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీ భరత్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించడం లేదు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు కోరిన రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి అయిన తరువాత.. స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

# వైసీపీ గూటికి శైలజానాథ్



అనంతపురం జిల్లాలో సింగనమల ఎస్సీ నియో జకవర్గానికి ఒక సెంటిమెంట్ ఉంది. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని సెంటిమెంట్. గత 30 సంవత్సరాలుగా అదే సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతూ వస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా శైలజనాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తర్వాత టిడిపి నుంచి శమంతకమణి, ఆమె కుమార్తె యామిని బాల మంత్రులుగా , ఎంఎల్ఏలుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా గెలిచిన 2024 ఎన్నికల్లో మాత్రం జొన్నలగడ్డ పద్మావతికి వైసిపి టికెట్ దక్కలేదు. తెలుగుదేశం పార్టీ నుంచి బండారు శ్రావణి 2024 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైసీపీ తరపున జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో వీరంజానేయులు అనే టిప్పర్ డ్రైవర్‌నీ వైసిపి బరిలోకి దింపింది. దీంతో అక్కడ వైసిపి ఓటమి చవి చూసింది. ఓటమి అనంతరం సింగనమల అసెంబ్లీ సమన్వయకర్తగా వీరాంజనేయులు నియమించింది వైసీపీ అధిష్టానం. కానీ పైకి మాత్రమే వీరాంజనేయులు పేరు కానీ నియోజక వర్గంలో మాత్రం మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివ రెడ్డిదే హవా కొనసాగుతుందని వైసీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు.

ఇప్పుడు మరోసారి సెంటిమెంట్ సెగ్మెంట్‌లో మార్పులకు వైసిపి సిద్ధమౌతోంది అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వైసిపి సింగనమల నియోజకవర్గం ఇన్చార్జిగా వీరాంజనేయులు కొనసాగుతున్నా ఆయనకు పెద్దగా ఎక్కడ సపోర్ట్ లేదు. దీంతో ఆయన ఉన్న లేనట్టే అని వైసిపి అధిష్టానం భావిస్తూండడంతో ఇక వేరే వ్యక్తి కోసం వెతుకులాట ప్రారంభించింది. ఇదిలా ఉంటే, శైలజానాథ్ వైసీపీలోకి వచ్చే అవకాశం ఉందని మరో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అనంతపురం జిల్లా సింగనమలలో జరుగుతున్న మార్పులతో శైలజానాథ్ వైసీపీలోకి రానున్నారని టాక్ నడుసోతంది. దీనిపై చర్చలు జరుగుతున్నాయట. 2019లో పద్మావతి అదే స్థానంలో గెలిచింది. 2024లో పద్మావతిపై పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థిని వెతుక్కోవాలని చంద్రబాబు భావించడంతో చాలా మంది శైలజానాథ్‌ను తలచుకున్నారు. శైలజానాథ్‌ను తమ పార్టీలో చేర్చుకుని ఎన్నికల్లో పోటీ చేసేలా పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. దానికి బదులు చంద్రబాబు శ్రావణిని ఎంపిక చేశారు. వైసీపీ జొన్నలగడ్డ పద్మావతికి బదులు వీరాంజనేయులు అనే టిప్పర్ ట్రక్ డ్రైవర్‌ను ఎంచుకుంది. కానీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు సింగనమలలో వైసీపీకి కొత్త నాయకుడు కావాలి కాబట్టి జగన్ మళ్లీ శైలజానాథ్‌ను పరిశీలిస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సహించిన కారణంగానే సాకే శైలజానాథ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలిసారిగా 2004లో ఎమ్మెల్యే పోటీ చేసి గెలిచారు. 2009లో మళ్లీ గెలుపొందారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో కూడా పని చేశారు. 2014లో శైలజానాథ్ తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేస్తారని జోరుగా ప్రచారం సాగింది. కానీ అప్పటికే అక్కడ తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి శమంతకమణి కూతురు యామిని బాలకు టికెట్ కేటాయించారు. దీంతో శైలజానాథ్ కొద్దిరోజులుగా సైలెంట్ అయ్యారు. మరోసారి ఎంపీగా ఉన్న జెసి దివాకర్ రెడ్డి ఒకరోజు శైలజనాథ్ ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించినట్లు అప్పట్లో ప్రచారం సాగింది అయితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ చేస్తారని గట్టిగా వినపడింది. ఆ టైంలో కూడా శైలజనాథ్‌కు టికెట్ రాలేదు. ఆ స్థానంలో బండారు శ్రావణికి చంద్రబాబు టికెట్ కేటాయించారు. దీంతో శైలజనాథ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ ఉన్నారు. వైసీపీలో చేరికపై శైలజానాథ్ కూడా సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. శైలజానాథ్ కుమారుడుకి మరో స్థానం అడుగుతున్నట్టు ప్రచారం. ఈ సారి నియోజకవర్గాలు పెంచే అవకాశం ఉండడంతో శైలజానాథ్ తన కుమారుడు రిత్విక్‌కి ఒకస్థానం అడుగుతున్నారు అని టాక్ వినపడుతుంది. అందుకు తగ్గట్టు శైలజానాథ్ కుమారుడు కూడా వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో ఈసారి శైలజానాథ్ కుమారుడిని రాజకీయ రంగంలోకి దింపుతాడని కన్ఫర్మ్ అయినట్టు సమాచారం. చూడాలి మరి సెంటిమెంట్ సెగ్మెంట్‌లో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయో.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# అఖండ భారత్ అడుగులు....

ప్రపంచంలో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. గత శతాబ్ధంలో పూర్వపు అవిభక్త రాజ్యాల పాలన కాదని ఎన్నో దేశాలు స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్నాయి. అయితే, ఇప్పుడు రష్యా, చైనా? చివరికి అమెరికా సామ్రాజ్యవాదం దిశగా అడుగులేస్తున్నాయి. రష్యా ఉక్రెయిన్‌ను సొంతం చేసుకోవాలని చూస్తున్నా? చైనా తైవాన్‌ను ఆక్రమించాలనుకున్నా? అటు, కొరియాల గొడవైనా? ఇటు, మిడిల్ ఈస్ట్ యుద్ధమైనా? స్పష్టంగా సామ్రాజ్యాలను విస్తరించుకోవాలనే ఉద్దేశం గట్టిగానే ఉంది. చివరికి అమెరికా సైతం? కెనడా, మెక్సికో, పనామా, గ్రీన్ ల్యాండ్‌లను కలుపుకోడానికి ఆసక్తిగా ఉంది. ఇటీవల, దీనిపై అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక, ఇప్పుడు భారత్ కూడా ఇదే దిశగా అడుగులేస్తుందా అనే సందేహం కలుగుతుంద భారత వాతావరణ శాఖ 150 ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'అవిభక్త భారతదేశం' సెమినార్‌లో పాల్గొనాలని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పాటు ఇతర పొరుగు దేశాలను భారతదేశం ఆహ్వానించింది. విభేదాలను పక్కనపెట్టి, భారత ఉపఖండం ఉమ్మడి చరిత్రను ఐక్యంగా జరుపుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన తొలి ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా? పొరుగున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్‌లకు ఆహ్వానాలు పంపారు. ఉపఖండంతో పాటు, మధ్యప్రాచ్యం, మధ్య-నైరుతి ఆసియా దేశాలకు కూడా ఆహ్వానాలు పంపించారు. అయితే, పాకిస్తాన్ ఇప్పటికే తాము పాల్గొంటామని ధృవీకరించింది. ఇక, బంగ్లాదేశ్ నుండి ధృవీకరణ కోసం భారత్ వేచి ఉంది. బంగ్లాదేశ్ ఓకే అంటే మాత్రం? ఈ సమావేశం ఒక చారిత్రాత్మక క్షణంగా మిగిలిపోతుంది. భారత వాతావరణ సంస్థ స్థాపన సమయంలో అవిభక్త భారతదేశంలో భాగమైన అన్ని దేశాల అధికారులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నట్లు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఇక, ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తుచేసుకోడానికి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.150 రూపాయల స్మారక నాణెం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.ఒకసారి, భారత వాతావరణ శాఖ చరిత్ర చూస్తే? ఈ శాఖ, జనవరి 15, 1875న స్థాపించబడింది. అయితే, దీని కంటే చాలా కాలం ముందుగానే వాతావరణ అబ్జర్వేటరీలు ఏర్పాటయ్యాయి. మొదటి వాతావరణ అబ్జర్వేటరీలను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించగా? కలకత్తా అబ్జర్వేటరీ 1785లో, మద్రాస్ అబ్జర్వేటరీ 1796లో, బాంబే అబ్జర్వేటరీ 1826లో ప్రారంభమైంది. ఇక, 19వ శతాబ్దం ప్రారంభంలో అనేక అబ్జర్వేటరీలను స్థాపించారు. ఇప్పుడు, ఇవి భారత ఉపఖండం అంతటా విస్తరించాయి. 1864లో వచ్చిన తుఫాను కలకత్తాను నాశనం చేసిన తర్వాత? 1866, 1871లో రెండు ఘోరమైన రుతుపవనాల వైఫల్యాల వల్ల బెంగాల్ అంతటా కరువు ఏర్పడింది. దాని తర్వాత 1875లో భారత వాతావరణ శాఖ ఉనికిలోకి వచ్చిందిబ్రిటిష్ పాలనలో అడ్మినిస్ట్రేటీవ్ రికార్డుల నిర్వహణ, డేటా విశ్లేషణ అవసరమని నిర్ణయించిన తర్వాత భారత వాతావరణ శాఖ ఏర్పాటయ్యింది. కాబట్టి, వాతావరణ పరిశీలనల సేకరణ, విశ్లేషణ ఒకే భవనంలో ప్రారంభమయ్యాయి. భారత వాతావరణ శాఖ అనే సంస్థగా దీన్ని పేర్కొన్నారు. ఇక, 1875లో ప్రారంభమైనప్పటి నుండి, ఐఎండి ప్రధాన కార్యాలయం కలకత్తాలోనే ఉంది. 1905లో దీనిని సిమ్లాకు, తర్వాత 1928లో పూణేకు? చివరికి 1944లో న్యూఢిల్లీకి తరలించారు. అప్పటి నుండి అది అక్కడే ఉంది. అయితే, సంవత్సరాలుగా ఐఎండి ఒక సాధారణ స్థాయి నుండి ఆసియాకు ప్రముఖ వాతావరణ సూచన సంస్థగా మారింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఐఎండి వాతావరణ శాస్త్రాలు, కమ్యూనికేషన్, శాస్త్రీయ ఆవిష్కరణలలో గణనీయమైన పురోగతిని సాధించింది. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో స్థాపించబడినప్పుడు, దానితో సహకరించిన మొదటి వాటిలో వాతావరణ శాఖ ఒకటి. 24 గంటల వాతావరణ పర్యవేక్షణ మరియు తుఫాను హెచ్చరికల కోసం తన సొంత భూస్థిర ఉపగ్రహం ఎటొాయిను ప్రయోగించిన మొదటి అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం నిలిచింది. కాబట్టే భారత వాతావరణ శాఖ 150వ వార్షికోత్సవాన్ని అఖండ భారత్ ఆశకు వేదిక చేసినట్లు కనిపిస్తోంది. ఇటీవల? ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో కూడా అఖండ భారత్ అంశం చర్చకు దారి తీసింది. కొత్త పార్లమెంట్ భవనంలోని ఓ గోడపై ఉన్న మ్యాప్ శతాబ్దాలకు ముందు ఉన్న భారతదేశాన్ని సూచించే విధంగా రూపొందించారు. అందులో ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న తక్షశిల, మరికొన్ని రాజ్యాలు కూడా ఉన్నాయి. ఈ మ్యాప్‌ని ట్విట్టర్‌లో షేర్ చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి.. 'సంకల్పం సుస్పష్టం.. అఖండ భారత్' అంటూ ట్వీట్ చేశారు. ప్రాచీన యుగాలలో భారతీయ ప్రభావాన్ని చిత్రించాలనే ఉద్దేశంతో? వాయువ్య ప్రాంతంలోని ప్రస్తుత అఫ్ఘనిస్థాన్ నుంచి ఆగ్నేయ ఆసియా వరకు విస్తరించిని అఖండ భారత్ చిత్రాన్ని చెక్కారు.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు



వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40-50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు.

**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**

సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



**35 శాతం మందికి బీపీ**

**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా ఫలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.



## టైట్ డ్రెస్ లో రకుల్ మైండ్ బ్లాక్ అందాలు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా ఎదిగిన వారిలో రకుల్ ఒకరు. ప్రస్తుతం టాలీవుడ్ లో అవకాశాలు లేకపోయినా బాలీవుడ్ లో అవకాశాలు చేజిక్కించుకుంటోంది. కెరటం సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో హిట్ కొట్టింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసింది లేదు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలు అందరితోనూ ఆడిపాడింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో ఎలాంటి ఛాన్స్ లు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా మాత్రం ఇక్కడి అభిమానులను అలరిస్తూ ఉంటుంది. రకుల్ కి ఫ్యాషన్ సెన్స్ చాలా ఎక్కువ. అది ఆమె ఫోటోలు చూస్తే అర్థమౌపోతంది. చాలా డిఫరెంట్ గా కనిపించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. తన లేటెస్ట్ ఫోటో షూట్ లతో ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా ఓ తెలుగు రంగు వైట్ డ్రెస్ లో మెరిసింది. తెల్లని టైట్ డ్రెస్ ఒక వైపు స్లీవ్స్ మరో వైపు స్లీవ్ లెస్ గా ఉంది. పూర్తిగా జంప్ సూట్ లా కనిపిస్తోంది. దానికి మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ తో పెయిర్ చేసింది. ఇక ఈ డ్రెస్ లో తన బాడీలో ఉన్న ఒంపులన్నీంటినీ చూపిస్తోంది. ముందుర అందాలను కూడా చూపించీ చూపించనట్లుగా చూపిస్తూ ఆకట్టుకుంటోంది. ఈ డ్రెస్ క్లాత్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంది. ఒంటికి మంచిగా గాలి ఆడాలని జాలీ క్లాత్ తో తయారు చేసినట్లుగా ఉంది. ఇప్పుడు ఈ ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సన్నజాజి తీగలా మెరిసిపోతున్నావంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. గతేడాది రకుల్ హిందీలో ఏకంగా ఐదు చిత్రాలతో అలరిచింది. ఒక్క హిట్ పడినా ఈ బ్యూటీ బాలీవుడ్ లో సెటిల్ అయిపోయినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ పాపం లక్ లేక అవన్నీ బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో అక్కడ కూడా ఈ అమ్మడి స్పీడ్ కాస్త తగ్గింది. ప్రస్తుతం హిందీలో ఎలాంటి చిత్రాలు లేకపోవడంతో దీంతో మళ్లీ రకుల్ సౌత్ సినిమాలవైపే చూస్తోంది. తెలుగులో ఛాన్స్ రాకపోయినా తమిళంలో మాత్రం వరుస అవకాశాలను అందుకుంటోంది. మరి ఈ విధంగా మళ్లీ ఆమె దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది.

## తెలుగు చీరలో నడుము అందం చూపిస్తోన్న ముద్దుగుమ్మ

తెలుగు అమ్మాయి శోభిత దూళిపాళ ముంబైలో మోడలింగ్ తో తన సినీ కెరీర్ ను మొదలు పెట్టి ఆ తర్వాత అక్కడే నటిగా కూడా మెప్పించింది. అక్కడ మంచి పేరు దక్కించుకున్న తర్వాత ఇప్పుడు శోభిత దూళిపాళ టాలీవుడ్ లో మరియు కోలీవుడ్ లో వరుసగా సినిమాల్లో నటిస్తోంది.

తాజాగా పొన్నియన్ సెల్వన్ సినిమాలో నటించి ఆకట్టుకున్న ఈ అమ్మడు తెలుగు లో మరోసారి గూఢచారి సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. మొత్తానికి ఇండస్ట్రీ లో బిజీ బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న పోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి యొక్క అందాల విందు ఆకట్టుకుంది. ఈసారి చీర కట్టులో నడుము అందం చూపిస్తూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చి సర్ ప్రైజ్ చేసింది. చీర కట్టు లో మరింత అందంగా శోభిత కనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇక ఈ అమ్మడి వ్యక్తిగత విషయానికి వస్తే గత కొన్నాళ్లుగా ఈ అమ్మడు నాగ చైతన్య తో ప్రేమలో ఉందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై స్పష్టత రావాల్సి ఉంది. పుకార్లే అంటూ పలు సార్లు చెప్పినా కూడా కొన్ని ఫోటోలు ఇద్దరు ప్రేమలో ఉన్నారేమో అనిపించేలా సాక్ష్యంగా ఉన్నాయి.



## ఫోజ్ కొట్టడంలో కేతిక తగ్గేదేలే

ఆకాశ్ పూరి 'రొమాంటిక్' చిత్రంతో కథానాయికగా పరిచయమైన ఉత్తరాది బ్యూటీ కేతిక శర్మ తనదైన అందం నటనతో మైమరిపించింది. నాగశౌర్య 'లక్ష్య' , వైష్ణవ్ తేజ్ సరసన 'రంగ రంగ వైభవంగా' చిత్రాలలోను నటించింది. ఇటీవల నితిన్ నటించిన రాబిన్‌హుడ్ లో అధీ ధా సర్‌ప్రైజ్ అనే ప్రత్యేక పాటలో నర్తించింది.సినిమాలు, కెరీర్ సంగతి అటుంచితే కేతికకు సోషల్ మీడియాల్లో అద్భుతమైన ఫాలోయింగ్ ఉంది. ఈ బ్యూటీ అందచందాలు, నటప్రతిభకు ప్రత్యేకించి ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్ స్టాలో నిరంతర ఫోటోషూట్లతోను ఫ్యాన్స్ ని ఆకర్షిస్తూనే ఉంది. కేతిక తాజాగా ఇన్ స్టాలో ఓ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసింది.కేతిక ఇదిగో ఇలా రిసార్ట్ లాంజ్‌లో తీరిగ్గా కెమెరాలకు ఫోజులిచ్చింది. రిలాక్స్‌డ్‌గా భంగిమలో కూచున్న కేతిక థై సొగసులను ఎలివేట్ చేసింది. ఈ ఫోటోషూట్ కి 'మంత్రము' అనే హ్యాష్ ట్యాగ్‌ని జోడించింది. కేతిక మంత్రముగ్ధం చేసే అందచందాలకు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా షేర్ అవుతోంది.కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కేతిక తదుపరి తెలుగు తమిళంలో కథలు వింటోంది. ప్రత్యేక గీతంలో నర్తించిన 'రాబిన్ హుడ్' త్వరలో విడుదల కానుంది. ఎం రాజేష్ దర్శకత్వంలో ఓ సినిమాకి సంతకం చేసింది. కానీ అధికారికంగా వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

